తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శనివారం
31 అక్టోబర్ 2026
పేజీలు : 8

Follow :

చైన్ స్నాచింగ్‌లు చేస్తున్న ఇద్దరు దొంగల అరెస్ట్

ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్ : జిల్లా ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేట (జనంసాక్షి): కిరాణా షాపుల్లో మహిళలు ఒంటరిగా ఉన్న సమయాన్ని అదునుగా చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలు, అరెస్ట్ వివరాలను జిల్లా ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు. ఈ నెల 26న సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఒక కిరాణా షాపులో మహిళ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన ఇద్దరు వ్యక్తులు సిగరెట్, వాటర్ బాటిల్, సెంటర్ ఫ్రెష్ కావాలని అడిగారు. ఆమె వాటిని ఇచ్చే పనిలో నిమగ్నమైన సమయంలో మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై సూర్యాపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా ఈ నెల 11న కోదాడ పట్టణంలోనూ ఒక కిరాణా షాపులో మహిళ మెడలోని సుమారు రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఇదే తరహాలో అపహరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలకు సంబంధించి పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఇద్దరు అనుమానితులను గుర్తించి, విశ్లేషించగా గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించారు. ఈ క్రమంలో అక్టోబర్ 29న సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య ఆదేశాలతో సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద టూ టౌన్ ఎస్ఐ కె.గోపికృష్ణ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఖమ్మం వైపు నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి అనుమానాస్పదంగా వ్యవహరించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు చైన్ స్నాచింగ్ ఘటనల్లో తామే పాల్గొన్నట్లు వెల్లడైంది. నిందితులను ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ ఖాసీం అలియాస్ షన్ను, తుమ్మాటి భరత్ కుమార్ అలియాస్ భరత్ గా గుర్తించారు. వీరిలో షేక్ ఖాసీంపై మోత్కూరు పోలీస్ స్టేషన్ నందు గంజాయి, దొంగతనం కేసులు ఉండగా, తుమ్మాటి భరత్‌పై ఖమ్మం టౌన్ పోలీస్ స్టేషన్, ఖమ్మం జిల్లా హవేలీ పోలీస్ స్టేషన్ నందు గంజాయి కేసులు ఉన్నాయి. నిందితుల వద్ద సుమారు రూ.4 లక్షల విలువైన బంగారాన్ని ఖమ్మం పట్టణంలో ముత్తూట్ ఫైనాన్స్ నందు కుదవ పెట్టినట్లు గుర్తించడం జరిగిందని, దీనిని స్వాధీన పరుచుకుంటామని తెలిపారు. అలవాటుగా నేరాలు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని జిల్లా బహిష్కరణ చేయడం, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్ నమోదు చేయడం చేస్తున్నామని అన్నారు. పిడి యాక్ట్ అమలు చేసి ఎక్కువ కాలం జైలుకు పంపడానికి ప్రణాళిక చేయడం జరుగుతుందని, ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. రెండు కేసులను ఛేదించి నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య, ఎస్ఐ గోపికృష్ణ, రామనరసయ్య, శ్రీరాములు, కొండ రమేష్, నవీన్ బాగా పని చేశారని అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, ఎస్ఐలు సందీప్, కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నీళ్లపై ప్రైవేటు పెత్తనమా..?

- అక్కంపల్లి ప్రాజెక్టు నీటిని 'మస్కతి' డెయిరీ ఫామ్‌కు తరలిస్తున్నారంటూ ఆరోపణలు!
- ప్రత్యేక తూముపై అనుమానాలు.. అధికారుల మౌనంపై విమర్శలు!

పి.ఏ.పల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం పరిధిలోని అక్కంపల్లి ప్రాజెక్టు నీటి వినియోగంపై తాజాగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల అవసరాలు, సాగునీటి ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన ప్రాజెక్టు నీటిని 'మస్కతి' డెయిరీ ఫామ్‌కు

వార్తా లోపలి పేజీలో

సాంకేతికతను సన్మార్గానికి ఉపయోగించి విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్

వార్తా లోపలి పేజీలో

నీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

ఎల్‌నినోపై ముందస్తు చర్యలు

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి కార్యాచరణ ప్రణాళికలు

నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం.. ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వార్తా లోపలి పేజీలో

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

- 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాల పంపిణీ
- సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి
- త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీరు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

చందంపేట అక్టోబర్ 30(జనంసాక్షి) రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, సాగునీటి లభ్యత తదితర అంశాలపై వివరించారు.

100 శాతం సబ్సిడీతో ఉచితంగా వేరుశనగ విత్తనాలు

రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం 700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సంబంధిత సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను

మిగతా 2లో

జనంసాక్షి

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో ముందుకు సాగాలని సూచించారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ సమయంలో వరి పంట సాగుకు దూరంగా ఉండాలని, వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన వేరుశనగ తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పంటలను ఎంచుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పంట నష్టాలను నివారించుకోవాలని తెలిపారు.

90 బోర్లు ఎండిపోయాయి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నియోజకవర్గంలో తాగునీటిని అందించే బోర్లు సైతం ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు 90 బోర్లు ఎండిపోయాయని, వాటిలో అత్యధికంగా ఉమ్మడి చందంపేట మండల పరిధిలోనే ఉన్నాయని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటల సాగు చేపట్టాలని, వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసి ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి నీరు తీసుకొచ్చేందుకు కృషి

దేవరకొండ ప్రాంత రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, తద్వారా ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సబ్సిడీపై విత్తనాల పంపిణీ, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రకృతి పరిస్థితులను అర్థం చేసుకొని వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో పాటు దొండేటి మల్లారెడ్డి, ఏదుపుల గోవింద్ యాదవ్, మేకల రాజేందర్ రెడ్డి, , వాంకునావత్ పాపా నాయక్, కేతావత్ భరత్, జక్కుల మున్నయ్య యాదవ్, కొప్పుల సురేందర్ రెడ్డి, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎల్-నినో పై అవగాహన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ఎంపీడీవో ఆవుల రాములు

రామన్నపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్-నినో ప్రభావం వలన ఏర్పడబోయే కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి శుక్రవారం రామన్నపేటమండలంలోని కక్కిరేణి, ఎన్నారం, కుంకుడుపాముల గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆవుల రాములు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడంతో పాటు నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. వి బి జి రామ్ జి పథకం ద్వారా చేయవలసిన జల సంరక్షణ పనుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ గ్రామసభలకు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు చిల్ల మధురవేణి సురేష్, ఎలుగపురి జనని నర్సింగ్ రావు, గొలుసుల సత్తయ్య, ఆయా గ్రామాల వార్డు సభ్యులు గ్రామసభలలో పాల్గొన్నారు.

మురికి నీటి సమస్యకు ఇంకుడు గుంతలే ఏకైక పరిష్కారం

○10 రోజుల్లోగా ప్రతి ఇల్లు ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

○డ్రైనేజీ లేక ఎస్సీ కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు

○చర్యలు తప్పవని పంచాయతీ హెచ్చరిక:సర్పంచ్ అరూరి నరేష్

మాదుగులపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): మాదుగులపల్లి గ్రామంలో మురికి నీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని స్థానిక సర్పంచ్ అరూరి నరేష్ గ్రామస్తులకు తీవ్ర విజ్ఞప్తి చేశారు హైవే రోడ్డు నిర్మాణం చేపట్టే డ్రైనేజీ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవని, అందుకే గ్రామ పంచాయతీ పరిధిలోని నివాసితులు స్వచ్ఛందంగా ముందడుగు వేయాలని స్పష్టం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నీటి వాడకం తక్కువగా ఉండటం, ఖాళీ బీడు భూములు ఉండటంతో మురికి నీరు వాటిలోకి వెళ్లేదని తెలిపారు కానీ ప్రస్తుతం హైవే రోడ్డు నుండి మొదలుకొని 1వ వార్డు సగం, 2వ వార్డు, 3వ వార్డు సగం, 6వ వార్డు పెద్ద బజారు ఇళ్ల మురికి నీరంతా పాత హరిజన వాడ (ఎస్సీ కాలనీ) వైపు వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రస్తుతం అక్కడ ఎస్సీ కాలనీ వాసులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటుండటంతో వారి ఇళ్ల వద్ద మురికి నీరు చేరి తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కొందరు బాధ్యతారాహిత్యంగా ల్యాట్రిన్ (కమోడ్) నీటిని కూడా డ్రైనేజీ నీటిలో కలపడం వల్ల పెద్ద బజారు పరిసర ప్రాంతాలలో దుర్వాసన ఎక్కువై ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని మండిపడ్డారు ఈ సమస్యలన్నింటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడమే ఏకైక మార్గమని తేల్చి చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే చాటింపులు, వాట్సాప్ గ్రూపుల ద్వారా రెండు మూడు సార్లు తెలియజేసి, తగినంత సమయం ఇచ్చామని గుర్తుచేశారు గ్రామస్తులకు ఇదే చివరి అవకాశంగా 10 రోజుల కాలవ్యవధి ఇస్తున్నామని, ఈ లోపు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్ అరూరి నరేష్ కోరారు.

పిన్నవూర శ్రీ రామ కోటేశ్వరాలయంలో తేరా దంపతుల పూజలు

పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలని ఉపాధ్యాయుల వినతి

పెద్దవూర అక్టోబర్ 30 (జనంసాక్షి) పెద్దవూర మండల పరిధిలోని పిన్నవూర గ్రామంలో వెలసిన శ్రీ రామ కోటేశ్వరాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

పాఠశాల సమస్యల విన్నపం:

అనంతరం పిన్నవూర ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గోలి కృష్ణ, కోటేష్‌తో కలిసి మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మించేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తేరా చిన్నపరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి సందీప్, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ.. ఎల్‌నినోపై ముందస్తు చర్యలు

మిర్యాలగూడ,(జనంసాక్షి) అక్టోబరు 30: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసి, నీటి వృథాను అరికట్టడంతోపాటు వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం మిర్యాలగూడ కళావేదికలో ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై నిర్వహించిన నియోజకవర్గస్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

ప్రతి గ్రామంలో నీటి వనరుల ఆడిట్ నిర్వహించి, ఎన్ని రోజులకు సరిపడా నీరు అందుబాటులో ఉందో గుర్తించాలని కలెక్టర్ సూచించారు. నీటి లీకేజీలను అరికట్టి, ఇంకుడు గుంతలు, సోక్‌పిట్లు, వాటర్‌హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించాలన్నారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నీటి నిల్వ నిర్మాణాలు, ఫీడర్ ఛానళ్ల పనులను వెంటనే ప్రారంభించి, గ్రామీణులకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, తక్కువ కాలపరిమితి పంటలను సాగు చేయాలని సూచించారు.

ప్రజలను చైతన్యపరచాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఎల్‌నినో పరిస్థితులను ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టి కృషితో ఎదుర్కోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని 198 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. నాగార్జునసాగర్ నుంచి సాగునీరు అందే అవకాశం లేనందున యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండి, ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా రైతులు తమ వద్ద ఉన్న పశు గ్రాసాన్ని భద్రపరచుకోవాలని అన్నారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద ఇంకుడు గుంతలు, ఊటకుంటలు నిర్మించాలని కోరారు. బస్టాండ్లు, జనసమ్మర్ధ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే జనవరి నుంచి బీఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా తన 12 నెలల జీతంతో ప్రజలకు తాగునీటితోపాటు పెరుగన్నం అందించే కార్యక్రమాన్ని చేపడతానని ప్రకటించారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచులు గ్రామాల్లోనే ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దామరచర్ల పెద్ద చెరువును మూసీ నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పంటల మార్పిడితోనే మేలు: ఎమ్మెల్సీ శంకర్ నాయక్

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. యాసంగిలో వరి సాగు చేయకుండా జొన్నలు, పెసర్లు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, పంటల మార్పిడిని పాటించాలని కోరారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నీటి నిల్వ నిర్మాణాలు, ఫీడర్ ఛానళ్ల పనులు చేపట్టాలని, ఈ అంశాలపై సర్పంచులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలను వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు,మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ బాలకృష్ణ , వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్ , నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్ లు, కౌన్సిలర్లు,మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాంకేతికతను సన్మార్గానికి ఉపయోగించి విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్

హుజూర్ నగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): సాంకేతికతను సన్మార్గానికి, సత్కార్యానికి ఉపయోగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎం డి ఆర్ హైస్కూల్ నందు జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఇరుముడి సినిమాలోని ఒక పాత్ర పోక్సో చట్టానికి ఇనుమటింపబడి ఉన్నదని విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిరోజు తమ ఎదుట జరిగిన ప్రతి విషయాన్ని తమ తల్లిదండ్రులకు, గురువులకు చెప్పడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అన్ని విద్యలతో పాటుగా న్యాయ శాస్త్ర విద్య పట్ల కూడా విద్యార్థిని, విద్యార్థులు కనీస అవగాహన కలిగి ఉండటం మూలంగా దుర్మార్గము నుండి తమను తాము రక్షించుకొనడమే కాకుండా ఎదుటివారిని కూడా రక్షించినట్లు అవుతారని ఆయన పేర్కొన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన కొరకు అకుంఠిత దీక్షతో కృషిచేసి లక్ష సాధనలో విజయం సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆయేషా సరీన్ మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థాన ఆదేశం మేరకు సురక్ష బచ్ పన్ అభియాన్ నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థిని, విద్యార్థులకు వివిధ చట్టాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు లైంగిక వేధింపులకు గురికాబడినప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయడాన్ని చిన్నతనంగా భావించవద్దని అది తమ హక్కుగా గుర్తుంచుకోవాలని విద్యార్థిని, విద్యార్థులకు ఆమె సూచించారు. అత్యవసర సమయాలలో 112, 1098 లాంటి ఆధునిక ఆన్లైన్ నెంబరు లకు ఫోన్ చేసి వెంటనే తగిన సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు. అలాగే న్యాయ సహాయం కొరకు 1500 నెంబర్ లకు ఫోన్ చేసి ఆన్లైన్లో న్యాయ సహాయాన్ని పొందవచ్చునని న్యాయమూర్తి విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టం ద్వారా కఠిన శిక్షలు అమలు జరపబడుతున్నాయనీ, మరణశిక్ష కూడా పోక్సో చట్టం ద్వారా విధించవచ్చునని ఆమె తెలిపారు. పోక్సో చట్టం ద్వారా నమోదయిన కేసుల విచారణ కొరకు ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తుందని ఆ కోర్టు పోక్సో కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తుందని న్యాయమూర్తి విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టం ద్వారా ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అందువల్ల బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చునని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులను పాఠశాల యాజమాన్యం శాలువా, బొకే, మెమెంటో లతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు న్యాయమూర్తులకు విద్యార్థిని, విద్యార్థులు ఘన స్వాగతం పలికి పూలు చల్లుతూ న్యాయమూర్తులను వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ హై స్కూల్ కరెస్పాండెంట్ మేరెడ్డి దామోదర్ రెడ్డి, హుజూర్ నగర్ ఎస్సైలు చలి కంతి నరేష్, హనుమా నాయక్, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, న్యాయవాదులు భూక్య నాగేశ్వరరావు, షేక్ సైదా హుస్సేన్, రామావత్ అడవి రాముడు, ఎం ఎస్ రాఘవరావు, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, బానోతు శంకర్, రామినేని వెంకటేష్, గొట్టే ప్రశాంత్, చనగాని మహేష్, కుక్కడపు సైదులు, ధీరావత్ నాగేందర్ నాయక్, న్యాయ సేవా అధికార సంస్థ సిబ్బంది అనిత, సుశీల, న్యాయ, పోలీస్ శాఖ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భూసారం దెబ్బతినకుండా భూమిని రక్షించుకోవాలి

ఏవో ధరావత్ సైదా నాయక్

నూతనకల్ అక్టోబర్ 30 (జనంసాక్షి)

మండలంలోని రైతు సోదరులకు తెలియజేయునది, వ్యవసాయ భూముల సంరక్షణ, భూసార పరిరక్షణ, నీటి సంరక్షణ, ఎరువుల సమర్థ వినియోగం స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో కార్యక్రమం క్రింది రైతు వేదికలలో నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి ధరావత్ సైరా నాయక్ తెలిపారు. కార్యక్రమం నిర్వహించే తేదీలు ప్రదేశాలు 31-10-2026 న నూతనకల్ రైతు వేదిక, 01-11-2026 తాళ్లసింగారం రైతు వేదిక, 02-11-2026 దర్శనపల్లి రైతు వేదిక,04-11-2026 ? మిర్యాల రైతు వేదికలో జరుగుతాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని సాగు భూముల సంరక్షణ, భూసార పెంపుదల, నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, ఎరువుల పొదుపు మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తారు అని వారు తెలిపారు. కావున ఆయా గ్రామాల రైతు సోదరులు, రైతు నాయకులు వ్యవసాయంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలకు హాజరై శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పొందుతూ కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత ముందడుగు

పట్టభద్రుల ఓటరు నమోదుకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రత్యేక కార్యక్రమం

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి: పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, అక్టోబర్ 30 (జనం సాక్షి): అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ - ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేవరకొండలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పల్లా నర్సింహారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రారంభించి పట్టభద్రులకు ఫారం-18 ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2023 డిసెంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలపై శాసనమండలిలో తమ గళాన్ని వినిపించేందుకు పట్టభద్రుల ఓటు కీలకమని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య ఆయుధమే కాకుండా సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎనమల నవీన్, నూనె రామస్వామి, సూరిగి వినయ్, వట్టేపు శివకుమార్, షేక్ షంషోద్దీన్, జూలూరి జ్యోతిబస్, బొమ్ము రామాంజనేయులు, నూనె వెంకటేశ్వర్లు, జూలూరి మహేష్, ఎం.డి. జామిల్, మేగవత్ బాబు, వి. బాలు, పెంటమళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల భద్రతకు చట్టాలు రక్షణ కవచం

కె. అనిత సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్

దేవరకొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి): సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ పెంచికల్పహాడ్ లోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్ కె. అనిత చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టంలోని నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలల రక్షణకు చట్టాలు కల్పిస్తున్న హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, బాలలపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడం, బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ వనం జగదీశ్వర్, ప్రిన్సిపల్ ఆశీర్వాదం, ఎస్సై సాలకమ్మ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష

గురుకుల విద్యార్థులకు పోక్స్ చట్టంపై అవగాహన

రామన్నపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రామన్నపేట మండలంలోని జనంపల్లి రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం "సురక్ష బచ్పన్ అభియాన్ ? బాలల హక్కులు, పోక్సో చట్టం?2012" అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సదస్సులో భాగంగా బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (ఫోక్సో యాక్ట్ 2012), గుడ్ టచ్?బ్యాడ్ టచ్, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 112, న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోషల్ మీడియాను విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, తమ భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగించుకోవాలని, అనవసరమైన ఆకర్షణలకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి శ్రద్ధ చూపాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు మంచి పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కే శ్రీశైలం, కె. యాదయ్య రామన్నపేట పారా లీగల్ వాలంటీర్, పాఠశాల ప్రిన్సిపల్ కె. నాగమణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల గిరిజన డిక్లరేషన్ అమలు చేయకపోవడం సిగ్గుచేటు

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్

హుజూర్‌నగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి): చేవెళ్లలో ప్రవేశపెట్టిన గిరిజన డిక్లరేషన్ ను అమలు చేయకపోవడం సిగ్గుచేటని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్ లో శుక్రవారం 'గిరిజన గళం – తండాలో నిద్ర' పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. తండా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అర్హులైన గిరిజనులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు.గిరిజనుల ఓట్లతో గెలిచామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి తండాల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పి మొండిచేయి చూపారన్నారు. గిరిజన గురుకులాల సమస్యలు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవాలాల్ మహారాజ్ మందిరం, గోర్ ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది నగేష్ రాథోడ్, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ కన్వీనర్ వెంకట్రాం నాయక్, తెలంగాణ గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరవత్ రవి నాయక్, గిరిజన సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే కుంభం

వలిగొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి)
రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎదుల్లగూడెం, ప్రొద్దుటూరు, మాందాపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందుతుందా, అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారుల మాటలు నమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, దేవస్థాన చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, పట్టణ అధ్యక్షుడు జానకిరాములు, సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, కొండూరు భాస్కర్ గౌడ్, కొండూరు సాయి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి

సూర్యాపేట(జనంసాక్షి): వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుడకుడలో నూతనంగా ఏర్పాటు చేసిన కృపా ఏజెన్సీస్ ను ఆమె ప్రారంభించి మాట్లాడారు.నూతనంగా ఏర్పాటు చేసినటువంటి ఎల్ఫోమాక్స్ ఇంజన్ ఆయిల్ కృపా ఏజెన్సీస్ వారి సేవలను వాహనదారులు వినియోగించుకొని వారిని ఆదరించాలని అన్నారు.అన్ని రకాల వాహనాలకు ఉపయోగపడే విధంగా, వాహనాల మన్నికకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే ఎల్ఫోమ్యాక్స్ ఇంజన్ ఆయిల్ ను ఉపయోగించుకోవాలని సూచించారు.వాహనదారులకు నాణ్యమైన సేవలను అందించి వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, నిర్వాహకులు నర్ర అశోక్, కుశనపల్లి మధు,గుర్రం ప్రకాష్ రెడ్డి, మంగమ్మ, పాస్టర్ మచ్చా ఏసుపాదం, లోడంగి రమేష్, పడిదల సైదులు, యాదాసు శ్రీను, పడిదల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జల్సా సీరతున్ నబీ సభ కు పటిష్ట బందోబస్తు కల్పించాలి

దేవరకొండ, అక్టోబర్ 30(జనంసాక్షి)
మదర్స మిస్బ ఉల్ ఉలుమ్, ఈద్గా కమిటీ, ఉ జమియత్ ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో రేపు దేవరకొండ పట్టణంలోని ఆఖ్సా మస్జీద్ లో శనివారం సాయంత్రం తలపెట్టిన 36 వ, జల్సా సీరతున్ నబీ సభ కు పటిష్ట బందోబస్తు కల్పించాలని శుక్రవారం నగర సీఐ పి వెంకట్ రెడ్డి ని ఈద్గా కమిటీ కోరింది. ఈ యొక్క సభ కు ముఖ్య అతిథులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి మత పెద్దలు, జమియత్ నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ జల్సా కు దేవరకొండ నియోజకవర్గం పరిసరాల నుండి 3 నుండి నాలుగు వేల మంది ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సభ సజావుగా సాగేందుకు పటిష్ట బందోబస్తు కల్పించాలని ఈ సందర్భంగా కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి యండి ఇలియాస్ పటేల్, ఉపాధ్యక్షులు యం ఏ సాలర్ ఖదీర్, యండి సలీమ్, ఖాజా మైనొద్దీన్, సయ్యద్ దస్తగిర్, యం ఏ ఖాలేఖ్, ఎస్ కే ఇల్యాస్ బాబా, తదితరులు ఉన్నారు.

దేవరకొండ వైద్య రంగంలో సంజీవిని హాస్పిటల్ అరుదైన ఘనత

- ఐదేళ్లుగా వేధిస్తున్న మూత్రాశయ రాయిని విజయవంతంగా తొలగించిన వైద్య బృందం
- వైద్య నైపుణ్యం, సమన్వయంతో రోగికి ఉపశమనం

దేవరకొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి):
దేవరకొండ పట్టణంలోని సంజీవిని హాస్పిటల్ వైద్య బృందం వైద్య రంగంలో ప్రశంసనీయమైన ఘనత సాధించింది. గత ఐదేళ్లుగా మూత్రాశయంలో ఏర్పడిన భారీ రాయితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చెన్నా అనే రోగికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి రాయిని తొలగించారు. అనుభవజ్ఞులైన వైద్యుల నైపుణ్యం, ఆధునిక వైద్య విధానాలు, సిబ్బంది సమన్వయంతో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం విశేషం.రోగికి నిర్వహించిన వైద్య పరీక్షల అనంతరం యూరాలజీ నిపుణుడు డా. సుదర్శన్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో డా. కృష్ణ, ఎం.ఎస్., అనస్థీషియా నిపుణుడు డా. జవహర్లాల్ పాల్గొన్నారు. శాంతి, మంజుల, నాగ, నందు, శివ తదితర వైద్య, నర్సింగ్, సహాయక సిబ్బంది శస్త్రచికిత్స విజయవంతం కావడంలో తమ వంతు సహకారం అందించారు.దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న రోగికి అవసరమైన వైద్య సేవలు అందించి ఉపశమనం కల్పించేందుకు వైద్య బృందం సమిష్టిగా కృషి చేసింది. వైద్యుల అంకితభావం, నైపుణ్యం, సిబ్బంది సహకారం ఈ సందర్భంగా అభినందనీయం. దేవరకొండ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సంజీవిని హాస్పిటల్ చూపుతున్న చొరవ స్థానిక వైద్య రంగానికి సానుకూల పరిణామంగా నిలుస్తోంది.రోగి ఆరోగ్య పరిస్థితిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, తదుపరి చికిత్స అందించనున్నారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో సంజీవిని హాస్పిటల్ వైద్య బృందంపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

బెల్ట్ షాపులు నిషేధించాలి పాలకవర్గ తీర్మానం

గ్రామపంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వగ్గు రవి

పెన్ పహాడ్ అక్టోబర్ 30 (జనంసాక్షి) :
గ్రామంలో శాంతిభద్రతలను కాపాడటానికి, అలాగే మహిళలు, పిల్లల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మన గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని గ్రామ సర్పంచ్ వగ్గు రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం అందరూ కలిసి బెల్ట్ షాపుల ద్వారా విక్రయించే మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి మాట్లాడుతూ అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుల వల్ల గ్రామంలోని పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక, ఆరోగ్య సమస్యల బారిన పడుతూ, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయి.?కావున, గ్రామంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు (అక్రమ మద్యం విక్రయాలు) నిర్వహిస్తే వారిపై పోలీసు, ఎక్సైజ్ శాఖల సహకారంతో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పంచాయతీ తరపున 25000 వేల రూపాయలు జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు బెల్ట్ షాప్ యజమానులకు నోటీసులు అందజేసి వచ్చేనెల 9వ తారీఖు నుండి మద్యం విక్రయాల బెల్ట్ షాపు పూర్తిగా నిషేధించాలని తీర్మానించారు. ఈ విషయంలో గ్రామస్తులందరూ గ్రామ పంచాయతీకి సహకరించాలని, ఎక్కడైనా బెల్ట్ షాపులు

నడుస్తున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పంచాయతీ పాలకవర్గానికి లేదా అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోగుల నాగరాజు, వార్డు సభ్యులు ఒగ్గు వీరయ్య, ఎడవెల్లి సతీష్, సన్నాయిల సైదులు, ఒగ్గు తిరుపమ్మ వెంకన్న, షేక్ గులాం, కారోబార్ కట్టోజు శ్రవణ్ పాల్గొన్నారు...

రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 30 (జనంసాక్షి): ఈరోజు ఖమ్మం జిల్లా కేంద్రంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 14 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు 34 రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రధానం హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్టు విద్యార్థులు దాగి ఉన్న సృజలాత్మ శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్ర స్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

విద్యార్థులు దరఖాస్తు చేసే వివిధ రంగాలు

దేశభక్తి పాటలు. భరతనాట్యం. గిటార్. కీబోర్డు ప్లేయింగ్. ఫ్లూటు. పర్వతాహోరన. యోగా. చిత్రలేఖనం. కార్టూన్స్. కవిత్వం జానపద నృత్యం. జానపద పాటలు. మిమిక్రీ .మ్యాజిక్. సైకిలింగ్. వాలీబాల్. కబడ్డీ. కోకో బ్యాట్మెంటన్. చెస్. ఫుట్బాల్. రన్నింగ్. జాతీయ సమైక్యత శిబిరం.. కరాటే. కూచిపూడి. కోలాటం. తబలా. బతుకమ్మ.స్విమ్మింగ్. బాస్కెట్బాల్. స్కిటింగ్. .టెన్నిస్ . అర్చరి .ఈ రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ఆధారంగా మా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు దరఖాస్తు చివరి తేదీ నవంబర్ ఐదు, సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించబడును కావున నైపుణ్యం గల విద్యార్థులు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ప్రెస్ క్లిప్పింగ్ పాటు బయోడేటా దరఖాస్తు దారిని ఫోటో జత చేసి వారి దరఖాస్తును పోస్ట్ ద్వారా స్వీకరించబడును ఈ అడ్రస్ కు వలస సుభాష్ చంద్ర బోస్ రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక ఇంటి నెంబర్ 2-92 గ్రామము. కూరెల్ల. మండలం కోహెడ. జిల్లా సిద్దిపేట .పిన్ నెంబర్ 505473 పంపించగలరు ప్రతిభగల విద్యార్థులను కోరుచున్నాము.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకుందాం

సిపిఎస్ ఉద్యోగుల సత్తా చాటుదాం

ఓట్ ఫర్ ఓపిఎస్ మన నినాదం

పిలుపునిచ్చిన సిపిఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్

ఖమ్మం, (జనంసాక్షి) : వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన అర్హత కలిగిన ప్రతి ఒక్క సిపిఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయ, అధ్యాపకులు విధిగా గ్రాడ్యుయేట్ ఓటర్ గా నమోదు చేయించుకోవాలని టీఎస్ సిపిఎస్ ఈయు ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కుతో ఉద్యోగుల ప్రధాన సమస్య అయినటువంటి పాత పెన్షన్ పునరుద్ధరణ అంశాన్ని శాసనమండలిలో బలంగా లేవనెత్తే అభ్యర్థినే ఎన్నుకుందామని టీఎస్ సిపిఎస్ ఈయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ ఉద్యోగులను కోరారు.గడిచిన 10 సంవత్సరాలుగా పాత పెన్షన్ పునరుద్ధరణ డిమాండ్ చేస్తూ మన టీఎస్ సిపిఎస్ ఈయూ సంఘం ఆధ్వర్యంలో ఒకపక్క ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేస్తూనే.. అవకాశం వచ్చిన ప్రతి సందర్భాన్ని వినియోగించుకుంటూ ఓటు ద్వారా సిపిఎస్ ఉద్యోగుల ఆకాంక్షను బలంగా చాటడం జరిగిందన్నారు. వ్యూహాత్మకంగా మనం చేసిన ఉద్యమ ఫలితంగానే నేడు గ్రాట్యుటీ మరియు ఫ్యామిలీ పెన్షన్ సాధించుకోవడంతో పాటు పాత పెన్షన్ పునరుద్ధరణ లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు.ఓట్ ఫర్ ఓ పి ఎస్ నినాదంతో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన సిపిఎస్ ఉద్యోగుల సత్తా బలంగా చాటుదామన్నారు.

తెలంగాణ స్టేట్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ కు ఎంపికైన మడుపల్లి విద్యార్థి

మధిర, అక్టోబర్ 30 (జనంసాక్షి): ఇటీవల జరిగిన ఖమ్మం జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల కబడ్డీ టోర్నమెంటులో పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ మడుపల్లి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ చూపిన చింతల మల్లికార్జున్ ను రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ లో పోలీస్ గ్రౌండ్స్ లో త్వరలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పీఎం శ్రీ కబడ్డీ టోర్నమెంట్కు ఎంపిక చేయడం జరిగింది. నవంబర్ 5, 6 తేదీలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో మల్లికార్జున్ ప్రాతినిధ్యం వహిస్తాడు. మల్లికార్జున్ గత మూడు సంవత్సరాలుగా మధిర మండల స్థాయి, జిల్లా స్థాయి, సీఎం కప్ పోటీలలో పాల్గొని మడుపల్లి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవడం జరిగిందని, మల్లికార్జున్ చదువులో కూడా చురుగ్గా ఉంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహా రావు తెలిపారు. పాఠశాల పిడి మందా మాధవరావు, ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, బాజోజు జ్ఞానేశ్వరాచారి , పైడిపల్లి కిషోర్, సముద్రాల శైలజ, శైలం శ్రీదేవి , తాళ్లూరి సీత, బివిబిఎన్ఎం శర్మ , ఎం.సాములు,పాఠశాల ఏ ఏ పీ సి చైర్ పర్సన్ శ్రీమతి నాగలక్ష్మి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ , ఏ ఎం ఓ ప్రభాకర్ రెడ్డి , సి ఎం ఓ ప్రవీణ్ తదితరులు మల్లికార్జును ప్రత్యేకంగా అభినందించారు.

మోటమర్రి రైల్వే బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

మధిర, అక్టోబర్ 30 (జనంసాక్షి): మోటమర్రి గ్రామంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్ఓబి నిర్మాణ పనుల నిమిత్తం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థల పరిశీలన చేపట్టారు.బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఆయన శుక్రవారం గ్రామానికి విచ్చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు, గ్రామ పెద్దలకు పలు సూచనలు చేశారు.రైల్వే బ్రిడ్జి అందుబాటులోకి వస్తే మోటమర్రి చుట్టుపక్కల గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని, పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోటమర్రి గ్రామ గౌరవ సర్పంచ్ మర్రి సురేష్ , ఉప సర్పంచ్ శ్రీ బక్క కిరణ్ కుమార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కవిత డిగ్రీ కళాశాలకు మూడు స్వర్ణ పతకాలు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 30 (జనంసాక్షి) కాకతీయ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన డిగ్రీ పరీక్షల ఫలితాల్లో స్థానిక గట్టయ్య సెంటర్ లోని కవితా డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కళాశాల నుండి ముగ్గురు విద్యార్థులు బీఎస్సీ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ విభాగంలో జి జ్ఞాపిక, బీఎస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో ఎం. లావణ్య మరియు బీకాం విభాగంలో డి తేజశ్రీ లు ప్రతిష్మాత్మకమైన గోల్డ్ మెడల్స్ సాధించడం కళాశాలకు గర్వకారణం గా నిలిచారు. విశ్వవిద్యాలయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఎక్కువ బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పి ఉషా కిరణ్ కుమార్ ప్రత్యేకంగాఅభినందించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటు అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం, కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా బోధన ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కవిత పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రోజా రాణి మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించడం కళాశాల విద్యా ప్రమాణాలకు, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమని కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవితా కళాశాల బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జి పవన్ కుమార్ అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందంతోపాటు విద్యార్థిని విద్యార్థులు గోల్డ్ మెడల్ విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

సూర్యాపేట (జనంసాక్షి): నాణ్యమైన ఆభరణాలను విక్రయించి కస్టమర్ల నమ్మకాన్ని పొంది వ్యాపారంలో రాణించాలని సూర్యాపేట పట్టణ జ్యూవెలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్ కుమార్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్ లో శ్రీనవ్య జ్యూవెలరీ షోరూమ్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.వినియోగదారుల మన్ననలను పొందుతూ వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జ్యూయలరీ షాప్ నిర్వాహకులు వీరబోయిన వెంకన్న, వీరబోయిన రాము,నరసింహపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ ప్రశాంత్, మాజీ సర్పంచ్ చిన్న వెంకన్న భవాని, వెంకట సైదులు, బొమ్మ పెదవెంకన్న, బొమ్మ అంజయ్య, బొమ్మ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మధిర, అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రతి విద్యార్థికి విద్య తో పాటు వ్యక్తిగత భద్రత, చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక సిపిఎస్ ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ చైతన్య సదస్సు లో పాల్గొని పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. బాల బాలికలు లైంగిక లేక ఇతర వేదింపులకు గురి అయినపుడు తమ సమస్య ను నేరుగా తల్లి తండ్రులకు తెలపాలన్నారు. అత్యవసర సమయం లో హెల్ప్ లైన్ నంబరు 1098, 112 కు నేరుగా ఫిర్యాదు చేయటం ద్వారా సాయం అందుతుందన్నారు.సామాజిక మాధ్యమాలను చదువు, విజ్ఞానం పెంపొందించుకోవటానికి వాడాలన్నారు. విద్యార్థులు తల్లితండ్రులు, గురువులను గౌరవిస్తూ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం బాల బాలికలచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ సి హెచ్ రామరాజు, పాఠశాల ఇంచార్జి హెచ్ ఎం ఏ రవి, న్యాయవాదులు ఏం సతీశ్, అబ్రహం, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, పి ఎల్ వీలు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్,దేవరకొండ ఎమ్మెల్సీ నియోజకవర్గ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్

పి.ఏ.పల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి):
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్,దేవరకొండ ఎమ్మెల్సీ నియోజకవర్గ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పి.ఏ.పల్లి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయులకు, విద్యావంతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని,ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు.విద్యావంతుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించడంతోపాటు,వారి హక్కుల పరిరక్షణకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటు నమోదు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని,అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకుని నిర్ణీత గడువులోగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, నిరుద్యోగ యువత తమకు తెలిసిన అర్హులైన పట్టభద్రులకు సైతం ఈ విషయాన్ని

తెలియజేసి, ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జెల్లా భాస్కర్,బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతెం కరుణాకర్,నేరెడుగొమ్ము మండల అధ్యక్షులు నాగిళ్ల ఆంజనేయులు,బీజేపీ దేవరకొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సముద్రాల సహదేవ్,బీజేపీ పి.ఏ.పల్లి మండల ప్రధాన కార్యదర్శి నామిరెడ్డి అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలి: కాసారపు లక్ష్మణ్

చింతపల్లి, అక్టోబర్ 30(జనంసాక్షి)

చింతపల్లి: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాసారపు లక్ష్మణ్ కోరారు. చింతపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేలా కృషి చేయాలని అన్నారు. పట్టభద్రులు తమతో పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా ఓటరు నమోదు విషయాన్ని తెలియజేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కాసారపు లక్ష్మణ్ పిలుపునిచ్చారు..

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి

ఉచితంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం: నట్వ గిరిధర్

చింతపల్లి, అక్టోబర్ 30(జనంసాక్షి)
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నట్వ గిరిధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్?ఖమ్మం?నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, దానిని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల సౌకర్యార్థం మండల కేంద్రంలో ఉచితంగా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని, ఎలాంటి ఖర్చు లేకుండా అవసరమైన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగంపల్లి భాస్కర్, కొలుకులపల్లి కొండల్, నల్ల శంకర్, ఎండీ ఫయాజ్, సిద్దే స్వామి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కృషి

సూర్యాపేట (జనంసాక్షి):
ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డులలో సంక్షేమ,అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ నాలుగో వార్డు నేత్యాతండాలో ఐదు లక్షల రూపాయల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో నిర్మాణం చేయనున్న సిసి డ్రైన్ కు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో నాలుగో వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు.నాలుగో వార్డ్ లో బోర్ వెల్ తో పాటు పైపులైన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు.అధికార,ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ భూక్యా జ్యోతి లింగ నాయక్, ఏఈ తిరుమలయ్య, మున్సిపల్ అధికారులు,సిబ్బంది, వార్డు ప్రముఖులు వాజిద్ మియా, సలీం ఆఫ్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలను జయప్రదం చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి):
విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, విజ్ఞానంపై ఆసక్తిని కలిగించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలను జయప్రదం చేయాలని శ్రీవాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి సేవాసమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలోని విషయ పరిజ్ఞానంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రశ్నించే తత్వం, పరిశీలనాశక్తి ఎంతో అవసరమని తెలిపారు.విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిరంతర కృషి అభినందనీయమని తెలిపారు.చెకుముకి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడం, ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కలకుంట్ల సైదులు, కోశాధికారి డాక్టర్ క్రాంతి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు గొల్లమూడి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు దేవరశెట్టి నాగరాజు, గౌరవాధ్యక్షులు తల్లాడ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయండి

- నవంబర్ 15న నల్లగొండలో భారీ బహిరంగ సభ
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్

పి.ఏ.పల్లి,అక్టోబర్ 30 (జనంసాక్షి):
అఖిల భారత 36వ రైతు మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు.శుక్రవారం పి.ఏ.పల్లి మండలం వద్దిపట్ల గ్రామ పరిధిలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో సభ విజయవంతం కోసం ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాలు,యుద్ధ ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.బియ్యం కిలో రూ.90కు చేరిందని పేర్కొంటూ, ధరలను నియంత్రించడంతోపాటు రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.ప్రతి కుటుంబానికి నెలకు 50 కిలోల బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి,రోజువారీ కూలిని రూ.800కు పెంచాలని డిమాండ్ చేశారు.కరువు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించాలని,యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి ప్రతి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్మికులు, కర్షకులు,

వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఈ నేపథ్యంలో నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత 36వ రైతు మహాసభల బహిరంగ సభకు లక్షలాది మంది కార్మికులు,కర్షకులు,వ్యవసాయ కూలీలు,మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కావలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థిఅజయ్

కనగల్లు, అక్టోబర్ 30 (జనంసాక్షి)

నేటి నుంచి నవంబర్ 3 వరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొనడానికి కనగల్ మోడల్ స్కూల్ విద్యార్థి జినుకుంట్ల అజయ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ థామస్ తెలిపారు. ఈనెల 28న మేకల అభినయ్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో అజయ్ చురుకుగా ఆడి తన ప్రతిభను కనబడ చి మొదటి స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో ఆడటానికి ఎంపికైన అజయ్ ని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీది అసమర్థ పాలన

మాజీ శాసనసభ్యులు, డాక్టర్ గాదరి కిషోర్ కుమార్

తుంగతుర్తి అక్టోబర్ 30 (జనంసాక్షి)

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలన కొనసాగిస్తుందని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అధ్యక్షతన 6 మండలాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు, ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు కరువు రాగానే చేతులెత్తేసిన చేతగాని సీఎంగా చరిత్రలో మిగిలిపోతాడని అన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్లనే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఇది ముమ్మాటికి ప్రకృతి తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు అని అన్నారు, ప్రజలకు భరోసా ఇవ్వడం మానేసి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు, టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కూడా అమలు చేసే దిక్కు లేకుండా పోయిందన్నారు, 420 అబద్ధాల హామీతో ప్రజలను మోసం చేసి గద్దె ఎక్కిన రేవంత్. సంక్షేమ పథకాలు మొత్తం నీరుగార్చారని అన్నారు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులే గ్రామాల్లో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటూ, తిరుగుబాటు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని విమర్శించడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడం, రాజకీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం పైనే దృష్టి సారిస్తున్నారని అన్నారు ,రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎలినోనో ,తుపాను వంటి ప్రకృతి విపత్తులపై కూడా ప్రభుత్వానికి సరైన అవగాహన, ముందస్తు చర్యలు లేవని విమర్శించారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడంతో పాటు తుంగతుర్తి లో కూడా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేందర్ రావు, పలు మండలాల అధ్యక్షులు, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, ఎస్ ఏ రజాక్, గుండగాని రాములు గౌడ్, పులుసు యాదగిరి గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, దొంగరి శ్రీను,తునికి సాయిలు,పలు గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపావళి క్రాకర్స్ దుకాణాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి

హాలియా జనంసాక్షి అక్టోబర్ 30

హాలియా పురపాలక సంఘ పరిధిలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని క్రాకర్స్ (టపాసుల) దుకాణాలను ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు, ముందస్తుగా హాలియా పురపాలక సంఘ కార్యాలయంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఔూఅ) మరియు అవసరమైన అనుమతులు పొందాలని మున్సిపల్ కమిషనర్ శ్రీ కే. రవీందర్ రెడ్డి గారు తెలిపారు. హాలియా పట్టణ పరిధిలో క్రాకర్స్ దుకాణాలను ఆదిత్య కేర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల ఏర్పాటుకు ముందే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి, నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందిన అనంతరమే దుకాణాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, సంబంధిత నిబంధనలను పాటిస్తూ మాత్రమే దుకాణాలు నిర్వహించాలని, అనుమతులు లేకుండా క్రాకర్స్ దుకాణాలను ఏర్పాటు చేయరాదని కమిషనర్ గారు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని కూడా తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమర్

కోదాడ,(జనంసాక్షి):

కోదాడ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి ఉమర్ మాట్లాడుతూ విద్యార్థులు పోక్సో చట్టం-2012పై అవగాహన కలిగి ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను గుర్తించి అప్రమత్తంగా మెలగాలని సూచించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక విధులు, చట్టాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. గట్ల నరసింహారావు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని,తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, న్యాయవాదులు సీతారామరాజు, కన్నన్ సాబ్, పెద్దబాబు, నవీన్ కుమార్, సామ, హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార దుకాణాలపై మున్సిపల్ కొరడా

నిబంధనలు, పరిశుభ్రతా ప్రమాణాలు పాటించని వ్యాపార సంస్థలకు రూ.10 వేల జరిమానా

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆకస్మిక తనిఖీలు..మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం

చండూరు, అక్టోబర్ 30 (జనంసాక్షి)

చండూరు మున్సిపాలిటీలోని చికెన్ షాపులు, సూపర్ మార్కెట్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో అపరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, గడువు తేదీలు, మాంసం నాణ్యత, వ్యర్థాల నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. నిబంధనలు, పరిశుభ్రతా ప్రమాణాలు పాటించని వ్యాపార సంస్థలకు మొత్తం రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా తనిఖీలు చేపడుతున్నామని, వ్యాపారులు తప్పనిసరిగా పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన, తాజా ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ఆదేశించారు. ఈ అంశంపై శుక్రవారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై నిరంతరం ఆకస్మిక తనిఖీలు కొనసాగించి మరిన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే దుకాణాలు, రెస్టారెంట్లనే ప్రోత్సహించి చండూరును పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ మేనేజర్ జి. రాములు, వార్డు ఆఫీసర్ జి. శ్రీరాములు, పర్యావరణ ఇంజనీర్ ఎం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు జి. మహేష్, జి. రమేష్ పాల్గొన్నారు.

బ్రహ్మణ వెల్లంల ఉదయ సముద్రం కాలువ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

చిట్యాల, అక్టోబర్ 30 (జనం సాక్షి):

తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని తన నివాసంలో బ్రహ్మణ వెల్లంల ఉదయ సముద్రం కాలువ పనుల పురోగతిపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ తదితర అధికారులను పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు సాధించిన పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కాలువ పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

వికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ

కనగల్లు, అక్టోబర్ 30 (జనంసాక్షి)

కనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు వికె ఫడేషన్(వసుదేక కుటుంబం) మరియు కోగిటి ఫైనాన్షియల్ సర్వీస్ ల ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు సృజనా కుమారి, ఉపాధ్యాయులు ఆరూరి జానయ్య, ఒ కులారాణి, ఆశ్ర, కవిత, మాధవి, లత, జీనత్, రాజా, అరుణ్, శ్రీనివాస్, రమేష్, సంగీతారావు, షాహిదా, యాదమ్మ తదితరులున్నారు.

ఏజెన్సీ ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలి

○ స్పెషలిస్ట్ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలి

○ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు న్యాప్కిన్స్ పంపిణీ చేయాలి

భద్రాచలం అక్టోబర్ 30 (జనంసాక్షి)

ఏజెన్సీ ప్రాంతంలోని ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను అధిగమించేందుకు ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు, అవసరమైన చోట స్పెషలిస్ట్ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్. చెంగ్తూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీడీఏ పీవోలు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య ఆరోగ్య శాఖ అవసరాల కోసం ఐటీడీఏ పీవో వద్ద రూ.కోటి కంటింజెన్సీ నిధులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిధులను అత్యవసర వైద్య అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇతర ఆరోగ్య శాఖ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. వైద్యుల కొరతను పరిష్కరించేందుకు టీవీవీపీ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌తో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా అధిక డిమాండ్ ఉన్న వైద్య విభాగాల్లో స్పెషలిస్టుల కొరతను గుర్తించి, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యులను ఆకర్షించేందుకు అదనపు ప్రోత్సాహకాలు కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న ట్రైబల్ టీ–హబ్ పనుల పురోగతిని పరిశీలించేందుకు రాష్ట్రస్థాయి అధికారుల బృందాన్ని పంపించాలని సూచించారు. ఆ బృందం నివేదిక ఆధారంగా ఇప్పటికే కేటాయించిన నిధులకు అనుగుణంగా వైద్య పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు సకాలంలో న్యాప్కిన్స్ పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ సూచనల మేరకు ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి తప్పనిసరిగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, వైద్యులు, రోగులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్షలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఏడీఎంహెచ్‌వో సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన పెంచాలి

- గోవిజ్ఞాన పరీక్షల్లో గిరిజన విద్యార్థులు ప్రతిభ చాటాలి

- ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం అక్టోబర్ 30 (జనంసాక్షి)

గోసేవ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గోవిద్యా విజ్ఞాన పరీక్షల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. ఇందుకోసం విద్యార్థులకు గోవిజ్ఞాన పుస్తకాలను అందించి, పరీక్షలకు సిద్ధం చేయాలని సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గోసేవ ఆధ్వర్యంలో రూపొందించిన గోవిజ్ఞాన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేసి, విద్యార్థులు వాటిని చదివేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల, మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి, నవంబర్ 7న కొత్తగూడెంలోని స్వర్ణభారతి హైస్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పరీక్షలకు పంపించాలని కోరారు. జిల్లా స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నవంబర్ 15న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేల నగదుతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహుమతులను రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గోసేవ జిల్లా అధ్యక్షుడు కే. యాకయ్య స్వామి, సహాయకులు, యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర మండల బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పెండ్యాల సంతోష్ రావు ఏకగ్రీవ ఎన్నిక

పెద్దవూర:అక్టోబర్ 30 (జనంసాక్షి)

పెద్దవూర మండల బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా పోతునూర్ గ్రామ సర్పంచ్ పెండ్యాల సంతోష్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, ఉపాధ్యక్షురాలిగా లింగంపల్లి గ్రామ సర్పంచ్ నల్లమెట్టి లక్ష్మమ్మ హనుమంత్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల సర్పంచులు ప్రకటించారు. మండలంలోని బీఆర్ఎస్ సర్పంచులందరూ ఏకతాటిపై నిలిచి, సంప్రదాయబద్ధంగా ఈ ఎన్నికను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సర్పంచులు జటావత్ రవి నాయక్, సల్ల అంజిరెడ్డి, తుడుం శ్రావణి రాకేష్, జానపాటి సునీత లక్ష్మణ్, రామావత్ వినోద్, ఖమ్మంపాటి పద్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకొని సమన్వయంతో కృషి చేస్తామని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి మండలంలోని పలువురు నాయకులు మరియు సర్పంచులు శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నూతన ఛాంబర్ ప్రారంభం

○ఉపాధ్యాయులు, సిబ్బంది○గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి ○ ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం అక్టోబర్ 30 (జనంసాక్షి)

– గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ఉపాధ్యాయులు, సిబ్బంది, గిరిజనులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్యూటీ డైరెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ ఛాంబర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, కార్యాలయానికి వచ్చే వారు ప్రశాంతంగా కూర్చొని తమ పనులను పూర్తి చేసుకునేలా అవసరమైన విభాగాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగాన్ని సందర్శించి, గిరిజన విద్యా వ్యవస్థకు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్, డీడీ చందన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దండు మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో 'స్వచ్ఛత సేవ' కార్యక్రమం

చౌటుప్పల్ అక్టోబర్ 30(జనం సాక్షి)

మండలంలోని దండు మల్కాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో 'స్వచ్ఛత సేవ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిరంజన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మల్కాజ్గిరి కృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. సూర్య కళ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు, గర్భిణీలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత మరింత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉప్పరి అనిల్ కుమార్, పొట్లపల్లి శివ శంకర్, కోత్త మహేష్, సంగం రవితేజ, ఒంటెద్దు రాజులతో పాటు అంగన్‌వాడీ టీచర్స్ ఎన్. స్వప్న, వి. విజయలక్ష్మి, జె. సోనీ, ఎన్. శైలజ మరియు స్థానిక తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుడిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన దేవరకొండ డీఎస్పీ

- పలు రికార్డులు,ఫైళ్ల పరిశీలన..పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్ష

పి.ఏ.పల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి)

నల్గొండ జిల్లా పరిధిలోని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలు రికార్డులు,ఫైళ్లను పరిశీలించి,పోలీస్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డుల నిర్వహణ, కేసులకు సంబంధించిన ఫైళ్ల వివరాలను పరిశీలించిన డీఎస్పీ.. విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని,ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా సమర్థవంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, గుడిపల్లి ఎస్సై డి.నరసింహులు,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి

○ సత్తుపల్లిలో ఘనంగా 73వ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు

○ టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

సత్తుపల్లి (జనంసాక్షి): క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ (ఒఇఏఎం) సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మువ్వా విజయ్ బాబు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన 73వ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని, సమిష్టిగా పనిచేసే తత్వాన్ని క్రీడలు నేర్పుతాయన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత క్రీడ అయిన కబడ్డీలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు చక్కటి వేదికగా ఉపయోగపడతాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా సమాజ హితాన్ని కాంక్షిస్తూ మహిళా క్రీడాకారులను ప్రోత్సహించేలా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా సంస్కృతిని మరింత విస్తరించి, ప్రతిభావంతులైన క్రీడాకారులు దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొణిదెల శ్రీనివాసరావు, నాయకులు రవీంద్ర ప్రసాద్, నరేంద్ర, తెల్లూరి శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, దుర్గాప్రసాద్, కోణార్, ఎర్ర రమేష్, అస్లాం, పోటీల నిర్వాహకులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారిణులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల నీళ్లపై ప్రైవేటు పెత్తనమా..?

తరలిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేక తూము ఏర్పాటు చేశారనే అనుమానాలు వ్యక్తమవుతుండటంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

- ప్రత్యేక తూముపై అనుమానాలెందుకు?

అక్కంపల్లి ప్రాజెక్టు నుంచి డెయిరీ ఫామ్‌కు నీటిని తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక తూము ఏర్పాటు,దాని వినియోగం,నీటి సరఫరాకు సంబంధించిన అనుమతులపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నీటి తరలింపునకు సంబంధించి అధికారిక అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేశారు? నీటి వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరుగుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల మౌనంపై విమర్శలు!

ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన నీటి వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు వాస్తవాలను వెల్లడించి అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది.ప్రాజెక్టు నీటి వినియోగంపై పారదర్శకత పాటించడంతో పాటు,నీటి తరలింపునకు సంబంధించిన అనుమతులు,సాంకేతిక వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

- విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి!

అక్కంపల్లి ప్రాజెక్టు నీటి తరలింపుపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవమెంత? ప్రత్యేక తూము ఏర్పాటు వెనుక ఉన్న కారణాలేమిటి? నీటి వినియోగానికి సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా నీటి వినియోగంపై పర్యవేక్షణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సమాచారం కొరకు ప్రాజెక్టు డి ఈ ని ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

మండల పరిషత్ సమావేశంలో ప్రజాసమస్యలపై తీవ్ర చర్చ

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సరఫరా మరియు భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

పెద్దపూర్: అక్టోబర్ 30 (జనంసాక్షి) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ వి.సతీష్ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొని మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

సమావేశంలో చర్చించిన ముఖ్యమైన అంశాలు:

ఇందిరమ్మ ఇళ్లు ఒ విద్యుత్ సమస్యలు: గ్రామాల్లో దీర్ఘకాలంగా వేధిస్తున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రతినిధులు కోరారు. అలాగే 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' కింద గుడిసెలలో నివసిస్తున్న అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సరఫరా: మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ భవనాలకు స్థలాలు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిలిచిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు ఒ భూగర్భ జలాల పెంపు:

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున, అన్ని గ్రామ పంచాయతీల్లో వి.బి.-జి. రామ్‌జీ పథకం కింద కూలీలకు అధిక సంఖ్యలో ఉపాధి పనులు కల్పించాలని కోరారు. భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, పంట కుంటలు, నీటి కుంటలు వంటి 'జలసిరి' పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ కాసిం, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు మరియు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన ఆహారం కల్పించాలి..
- బిర్సా ముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి..
- గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ, డైరెక్టర్ బి.ఎం. సంతోష్..

భద్రాచలం అక్టోబర్ 30 (జనంసాక్షి) గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ, డైరెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్స్ ఛార్జీలు, యూనిఫాంల పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శుక్రవారం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, సహాయ ప్రాజెక్టు అధికారులు, ఉప సంచాలకులు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏలు, జిల్లాల వారీగా విద్యాసంస్థలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉద్యోగుల వేతనాలు, గిరిజన అభివృద్ధి పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, విద్య, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలను పర్యవేక్షించాలని సంతోష్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు నిత్యావసర సరుకులను సకాలంలో సరఫరా చేయడంతో పాటు వాటి నాణ్యతను పరిశీలించాలని, ఆహార కలుషిత ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డైట్, కాస్మోటిక్స్, అద్దె బకాయిల చెల్లింపులతో పాటు ఉద్యోగుల వేతన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను కుట్టించి సకాలంలో పంపిణీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాల మంజూరు, విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. బిల్లుల సయోధ్య, పెండింగ్ చెల్లింపులు, గిరిజన సహకార సంస్థకు అవసరమైన భూముల లభ్యత అంశాలపై కూడా సమీక్షించారు. ట్రైకార్ ద్వారా గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డీఏ-జేజీయూఏవై, పీఎం-జన్మన్ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, వ్యయం, పెండింగ్ పనుల వివరాలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న జన్‌జాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా గిరిజన గ్రామాల్లో బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకు మంజూరైన నిధులు, ఖర్చులు, బిల్లులు, వినియోగ ధ్రువీకరణ పత్రాలతో పాటు కార్యక్రమాల ఫొటోలను జతచేసి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఉపకార వేతనాల పంపిణీ, జీసీసీ ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరుకుల నాణ్యత, ఉద్యోగుల వేతన సమస్యలు, యూనిఫాంల పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు, పీఎం-జన్మన్ పథకాల అమలు, జన్‌జాతీయ గౌరవ్ దివస్ వేడుకలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి నవంబర్ 15వ తేదీలోగా ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఖమ్మం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, డీఎం జీసీసీ రామానందం, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పీహెచ్‌వో ఉదయ్ కుమార్, జేడీఎం హరికృష్ణ, గురుకులం ఏవో నరేందర్, జీసీసీ మేనేజర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా మంత్రి పొంగులేటి

ముగ్గురిని కోల్పోయిన కుటుంబానికి ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు ఆదేశం..

ఖమ్మం రూరల్, అక్టోబర్ 30:(జనం సాక్షి) ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. జాన్ బాత్ తండా సర్పంచ్ భీమా నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంగళగూడెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని మోటం మణియమ్మ, మోటం కీర్తన, కావ్య ఇటీవల కాలువలో పడి మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముగ్గురిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి, గ్రామంలో ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం గోళ్లపాడు గ్రామానికి చెందిన పరికిపల్లి భద్రమ్మ మృతిచెందడంతో ఆమె నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీరెల్లి అప్పారావు, కొప్పుల చంద్రశేఖర్, పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న

వలిగొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) మన ఓటు మన గొంతు నినాదంతో ఉద్యమకారుల ఫోరం ప్రారంభించిన ప్రచారంలో భాగంగా డిగ్రీ అర్హత కలిగి మూడు సంవత్సరాల కాలవ్యవధి ఉన్న ప్రతి అభ్యర్థి రాష్ట్రంలో జరగబోయే రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉమ్మడి నల్లగొండ వరంగల్ ఖమ్మం మరియు హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ స్థానాలకు జరగబోయే ఎన్నికల కొరకు తమ తమ జిల్లాలలోని అర్హులైన అభ్యర్థులు పాతవారు రెన్యువల్ చేసుకుని కొత్త వారు అప్లై చేసుకోవాలని పట్ట బద్రులైన విద్యావంతులు ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవడానికి అర్హులైన వారిని ప్రజలకు సేవ చేసే నాయకుని తెలంగాణ రాష్ట్ర ఉద్యమం పై అవగాహన కలిగిన వ్యక్తిని పట్టభద్రులైన విద్యావంతులు ప్రజా సేవకునిగా ప్రజల కొరకు సేవ చేసే విధంగా ఉండాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు సహకారం అందించాలి

సీఐ పంజాల సర్వయ్య

కల్లూరు అక్టోబర్ 30(జనంసాక్షి) ప్రజల ప్రాణ రక్షణ, ఆస్తుల పరిరక్షణతో పాటు గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు నేరాల నియంత్రణకు ప్రజలు పోలీస్ శాఖకు తమ వంతు సహకారాన్ని అందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని సత్తుపల్లి రూరల్ సీఐ పంజాల సర్వయ్య కోరారు. కల్లూరు పోలీస్ స్టేషన్ లో సత్తుపల్లి రూరల్ సిఐ పంజాల సర్వయ్య కల్లూరు ఎస్సై నాగరాజు మున్సిపల్ చైర్మన్, ధారావత్ మోహన్ నాయక్, పలువురు కౌన్సిలర్లు మండలంలోని 23 గ్రామ పంచాయతీల సర్పంచుల తో శుక్రవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కల్లూరు పట్టణం, మండలంలోని 23 గ్రామాలలో శాంతిభద్రతల అంశాల గురించి చర్చించి, గ్రామాలలో కల్లూరు మున్సిపాలిటీలో సీసీ కెమెరాలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో శాంతి భద్రతల నిరంతర పర్యవేక్షణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అందుకు పోలీసు వారికి సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వార్డు కౌన్సిలర్లు, 23 గ్రామాల సర్పంచులు పలువురు పుర ప్రముఖులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్ఐ

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

చింతపల్లి, అక్టోబర్ 30(జనంసాక్షి) సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతపల్లి ఎక్స్ రోడ్స్‌లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి పట్టణంలో ఫ్లాష్ వాక్ (ర్యాలీ) చేపట్టి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా సైబర్ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పోలీసులు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , రాంప్రజలు తదితరులు పాల్గొన్నారు..

తిరుమలాయపాలెంలో ఘనంగా బెల్లం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 30 (జనంసాక్షి) తిరుమలాయపాలెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బెల్లం శ్రీనివాస్ గారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పుల అశోక్ మాట్లాడుతూ.. బెల్లం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, నియోజకవర్గం లో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు. రామసహాయం అరవింద్ రెడ్డి, సర్పంచులు కర్నాటి రాజేంద్రప్రసాద్ మోర అనిల్ రెడ్డి ధారావత్ సుజాత నరసింహారావు బానోత్ సుజాత అనిల్ కుమార్ షేక్.కరీం.పోట్ల కిరణ్ గ్రామ సర్పంచ్ లు మోర నల్లమల్ల కీర్తి నిరణ్ కుమార్ కర్నాటి మురళీధర్ రావు గద్దల సుధాకర్ మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ నల్లమల్ల ప్రతాప్. కన మర్లపూడి కనకయ్య ఉడుగు ఉపేందర్.గోళ్ళ లింగయ్య.సయ్యద్.మదర్ . షేక్.నజీర్. మాజీ, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు పాల్గొని శ్రీనివాస్ గారికి శుభాకాంక్షలు అందజేశారు.

బాల్య స్నేహానికి అండగా నిలిచిన పదో తరగతి మిత్రులు..

- మిత్రుడి మరణం తట్టుకోలేక కన్నీటి పర్యంతం..
- కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం
- మేడిదపల్లి గ్రామ పెద్ద లఅభినందనలు

తిరుమలాయపాలెం అక్టోబర్ 30 (జనంసాక్షి) మిత్రుడి మరణవార్త విని తట్టుకోలేకపోయిన బాల్య స్నేహితులు తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. మేడిదపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ చిలకబత్తిని ముత్తయ్య (రాజు) పార్థివదేహాన్ని ఆయన బాల్యమిత్రులు, పదో తరగతి సహచరులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్న తమ క్లాస్‌మేట్ ఆకస్మికంగా మృతి చెందడం తీవ్రగ్భ్భ్రాంతికి గురిచేసిందని మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మంచి మనసున్న స్నేహితుడిని కోల్పోవడం తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ముత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయం లో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న బాల్యమిత్రులంతా కలిసి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని తమ చేతల ద్వారా చాటిచెప్పారు. మిత్రుడి మరణానికి స్పందించి, బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిన బాల్యమిత్రుల మానవతా దృక్పథాన్ని మేడిదపల్లి గ్రామ పెద్దలు అభినందించారు. స్నేహం అంటే కేవలం కలిసి ఉండటమే కాదు.. ఆపద లో అండగా నిలవడమని నిరూపించిన మిత్రుల ఔదార్యాన్ని కొనియాడారు. మరణంతో మిత్రుడు దూరమైనా.. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి స్నేహబంధానికి చిరస్థాయిగా నిలిచే నిదర్శనంగా బాల్యమిత్రులు నిలిచారు.

కరువు మండలంగా చంద్రుగొండను ప్రకటించాలి

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్.. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి

చంద్రుగొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి): చంద్రుగొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కొనగండ్ల వెంకటరెడ్డి, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధారా వెంకటేశ్వరరావు మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మిర్చి సాగుపైనా ప్రతికూల ప్రభావం పడిందని వారు పేర్కొన్నారు. పంటల దిగుబడులు తగ్గడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదించడంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. పాలక పక్ష నాయకులు సైతం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రుగొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం, సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో నల్లమోతు వెంకట నారాయణ, మద్దుకూరు సర్పంచ్ కృష్ణవేణి, గాదె లింగయ్య, భూపతి రమేష్, షమీ, కిలోతు శ్రీను, వెంకటేశ్వర్లు, పూసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో టీబీ స్క్రీనింగ్ శిబిరం

చంద్రుగొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి): చంద్రుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక టీబీ (క్షయ) స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, గ్రామ సర్పంచ్ రుక్మిణి, ఉప సర్పంచ్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఏఎన్ఎం ప్రేమలత, టీబీ సూపర్వైజర్ రఫెల్, ఆశా కార్యకర్తలు, జిల్లా టీబీ అధికారులు పాల్గొన్నారు.

దామల్ల లచ్చమ్మ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన ప్రెస్ క్లబ్ సభ్యులు..

కుటుంబానికి అండగా ఉంటామని హామీ

తిరుమలాయపాలెం అక్టోబర్ 30 (జనంసాక్షి) తిరుమలాయపాలెం మండల పరిధిలోని బీరోలు గ్రామంలో నమస్తే న్యూస్ రిపోర్టర్ మాతృమూర్తి దామల్ల లచ్చమ్మ కుటుంబ పరామర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల రిపోర్టర్లు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై లచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాతృమూర్తిని కోల్పోయిన తోటి రిపోర్టర్‌ను పలువురు ఓదార్చి ధైర్యం చెప్పారు. తల్లి మరణం తీరని లోటని, ఆ బాధను మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. లచ్చమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక రిపోర్టర్లు, ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ నాయకులు లచ్చమ్మ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు జోహార్లు -డి.ఎస్.పి..

ఆపదలో ఉన్న వారికి తల సేమియా రోగులకు కోసం రక్తదానం..

మెగా రక్తదాన శిబిరంలో సుమారు 55 యూనిట్ల రక్తనిధి సేకరణ..

మణుగూరు, అక్టోబర్ 30 (జనంసాక్షి): పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే కాకుండా, ప్రజల ప్రాణాలు కాపాడే సామాజిక బాధ్యతలోనూ ఎల్లప్పుడూ ముందుంటారని మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వంగా రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కిన్నెర కళ్యాణమండపం లో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ రక్షణ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని డీఎస్పీ కొనియాడారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి పోలీసులు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని గుర్తు చేశారు. అమరవీరుల స్మారకార్థం పోలీసులు, యువత పెద్ద ఎత్తున ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తాము సేకరించిన రక్తం తలసేమియా బాధితులకు ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడటానికి ఉపయోగపడుతుందని వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలు చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు.

ప్రత్యేక కార్యక్రమాలు:
మాదకద్రవ్యాల పై వ్యతిరేకంగా పోరాటం అనే కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలు బైక్ పై ర్యాలీ అవగాహన సదస్సుల తో పాటు వివిధ కార్య క్రమాలను నిర్వహించి ప్రజల్లో చైతన్యాన్ని తీసుకు రావడం జరిగింది. పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రజలలో సంబంధాలను బలోపేతం చేయడానికి పాఠశాల కళాశాల విద్యార్థుల చేత వ్యాసరచన పెయింటింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు వివిధ జిల్లాల్లో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మలుగు పోలీస్టేషన్లో పోలీసులు ఉపయోగించే ఆధునిక తుపాకులు, కమ్యూనికేషన్ పరికరాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు వేలిముద్రల సేకరణ విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని డి.ఎస్.పి రవీందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా డిఎస్పి రవీందర్ రెడ్డి తోపాటు సిఐ లు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. స్థానిక యువత రాజకీయ నాయకులు పట్టణ ప్రముఖులు ఆటో డ్రైవర్లు వ్యాపారస్తులు సుమారు 55 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ పోలీస్ శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సిఐ నాగబాబు తోపాటు ఏడుల్ల బయ్యారం, అశ్వాపురం సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

మహిళ పై దాడి కేసులో నిందితుడికి సాధారణ జైలు శిక్ష

ఖమ్మం టౌన్ (అక్టోబర్ 30) జనంసాక్షి మహిళ పై దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ప్రధాన నిందితుడికిన్యాయస్థానం ఏడాది సాధారణ జైలు శిక్ష తో పాటు 1000 రూపాయల జరిమానా విధించింది ఈ మేరకు మధిర.గౌరవనీయ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీప్తి వేముల శుక్రవారం తీర్పు వెల్లడించారు 2020 సెప్టెంబర్ 10నమధిర పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 177/2020 కేసులో నిందితులుగా ఉన్న పారా ప్రభాకర్ పారా ఈశ్వరమ్మ లపై ఐ పి సి 354(ఃి). 323. 324. 294(ఃి)తీ/ఏి 34సెక్షన్ ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు విచారణ అనంతరం ప్రధాన నిందితుడు పారా ప్రభాకర్ పై ఐ పి సి 323కింద నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష లేదా 1000. రూపాయల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది ఇదే విధంగా ఐ పి సి 354(ఃి). 324. 294. (ఃి)సెక్షన్ కింద అతడిని నిర్దోషి గా నిర్ధారించింది రెండో నిందితురాలు పారా ఈశ్వరమ్మ ను నిర్దోషి గా ప్రకటించింది ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి న్యాయస్థానం లో కేసు విచారణ సజావుగా జరిగేందుకు కృషి చేసిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు అప్పటి దర్యాప్తు అధికారి ఇన్స్ పెక్టర్ ఉదయ్ కుమార్ (ఐ వో పి .టాస్క్ ఫోర్స్) ప్రాసిక్యూషన్ అధికారి తీ భద్రయ్య బ్రీఫింగ్ అధికారి ఆ. రమేశ్ కోర్టు డ్యూటీ అధికారి జూ. కృష్ణ మోహన్ లైజర్ అధికారి ఎ. శ్రీకాంత్ ఎ సై ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఔషధ మొక్కల పంపిణీ

పలు పోలీస్ స్టేషన్లు, సబ్ జైళ్లకు మొక్కలు అందజేత

భద్రాచలం అక్టోబర్ 30 (జనంసాక్షి) పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సంస్మరణ దినోత్సవాల సందర్భంగా సారపాకకు చెందిన హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు పోలీస్ స్టేషన్లు, సబ్ జైళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇల్లందు పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, సబ్ జైలు, గౌరవ న్యాయస్థానం, మహబూబాబాద్ పోలీస్ స్టేషన్, సబ్ జైలు, టేకులపల్లి పోలీస్ స్టేషన్, పాల్వంచ పోలీస్ స్టేషన్‌లలో ఔషధ మొక్కలను అందజేశారు. పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి స్మృతికి ఈ కార్యక్రమాన్ని అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సంజీవరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పారా లీగల్ వాలంటీర్ పప్పుల జయ, ఇల్లందు కోర్టు పారా లీగల్ వాలంటీర్ సతీష్ ఖండేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

○బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ పిలుపు

○8వ డివిజన్‌లో ముమ్మరంగా ఓటరు నమోదు ప్రక్రియ

ఖమ్మం, (జనంసాక్షి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ పిలుపు నిచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం శుక్రవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. గోపాలపురం ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న తన నివాసం వద్ద ఆయన ప్రత్యేకంగా ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా గోపాలపురం, బాలపేట, ఎల్.బి. నగర్ ప్రాంతాలకు చెందిన పాత ఓటరు జాబితాలోని 432 మంది ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి వివరాలను సేకరించడంతో పాటు, నమోదు చేసుకోని వారి నుంచి ధ్రువపత్రాలు తీసుకుని అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. ఫోన్‌కు స్పందించని వారి వివరాలను నమోదు చేసుకుని, అందుబాటులో ఉన్న మరికొందరి వద్దకు నేరుగా వెళ్లి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. అలాగే నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేని వారికి అశోక్ స్వయంగా సహకరిస్తూ, అవసరమైన పత్రాలను తన వాట్సాప్ నంబర్‌కు పంపాల్సిందిగా సూచించారు. వారి తరఫున దరఖాస్తులు పూర్తి చేసి, అనంతరం రసీదు ప్రతులను తిరిగి వారికి అందజేస్తున్నారు. గత రోజుల్లో అందిన దరఖాస్తులను కూడా ఈరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా అశోక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు తుది గడువు నవంబర్ 6వ తేదీ వరకు ఉందని, ఆలోగా అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.